# చిట్టి కథ

- జెన్



## చంద్రుడు

ఆమె
వెళ్తూ వెళ్తూ
చందమామను
వ్యానిటీ బ్యాగ్‌లో
వేసుకుని వెళ్లింది.
అతని బతుకంతా
చీకటి రాత్రులే.



## కిడ్నాప్

‘నిన్ను చంపడం ఖాయం.
ప్రాణాలు తప్ప ఏమైనా కోరుకో’
అవకాశమిచ్చారు కిడ్నాపర్లు.
‘నా శవం ఇంటికి చేరేలా చూడండి.
ఇన్సూరెన్స్ డబ్బులొస్తాయి.
పిల్లల చదువులకు పనికొస్తాయి’
వేడుకున్నాడు బందీ.

## అమూల్యం



సంచి భుజానికి వేసుకుని
వడివడిగా నడుస్తున్నాడు
ఓ పెద్ద మనిషి.
‘అందులో ఏం ఉన్నాయ్’
కుతూహలం కొద్దీ అడిగాను.
‘చాలా విలువైనవి’ అని చెప్పాడు.
నిజంగానే అమూల్యమైనవి.
నాలుగడుగులు వేశాక..
ఆ సంచిలోంచి..
గింజలు తీసి పక్షులకు చల్లాడు.
పాత బట్టలు తీసి పేదలకు ఇచ్చాడు.



## చిల్లర

ఖరీదైన హోటల్‌లో
డిన్నర్ ముగించుకుని
బిల్లుతోపాటు
వంద రూపాయల
టిప్ ఇచ్చాను.
గేటు బయట యాచకురాలు
చేయి చాపినప్పుడు మాత్రం..
‘యాభై నోటుంది.
చిల్లర లేదు’ అని చెప్పి
తప్పించుకున్నాను.

## కానీ..

నిన్ను మరిచిపోవడం
ఎలాగో చెప్పు.
సంతోషంగా
విడాకుల కాగితాల మీద
సంతకం చేస్తాను.

